క్లుప్తంగా

పితృదేవతల పేరుతో వస్త్రదానం



పెడన: మహాలయ అమావాస్య సందర్భంగా పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975–76 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చక స్వామి అగ్నిహోత్రం హరికృష్ణ నేతృత్వంలో పూర్వ విద్యార్థులు తమ పితృదేవతలను స్మరించుకుంటూ వస్త్రదానం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చందన నారాయణరావు, కొసనం విజయలక్ష్మి, జూపూడి జాహ్నవి, మాగంటి ప్రసాద్, మల్లంపల్లి శ్రీనివాస్, సిద్ధినేని భాస్కరరావు, కొల్లూరి నాగభూషణం, జల్లూరి రాధాకృష్ణ, ఆగస్టేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భళ్ల ప్రసాద్, యక్కల శ్యామలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడితే కేసులా!




కృత్తివెన్ను: ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో శాంతియుత నిరసన తెలిపితే కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం అత్యంత హేయమైన చర్య అని కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శాంతియుతంగా కళాశాల సందర్శనానికి వెళ్లిన తమపై పోలీసులు కేసులు పెట్టి నోటీసులు అందజేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కేసులకు భయపడి ప్రజల పక్షాన పోరాటాలు వదిలే ప్రశ్నే లేదని.. ఇంతకు మించిన రెట్టింపుతో ప్రజాపోరాటాలు చేస్తామని ఆమె అన్నారు. ఇటువంటి చర్యలకు వైఎస్సార్ సీపీ నాయకులే కాదు, కార్యకర్తలు కూడా భయపడరన్నారు.

ప్రశాంతంగా ఎస్‌బీఐ ఆన్‌లైన్ పరీక్ష



పెడన: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం రెండో రోజు ఆదివారం మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాల సెంటరులో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. నాలుగు షిఫ్టులకు 720 మంది అభ్యర్థులకు గానూ 518 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, సెంటర్ అడ్మిన్ పి.అశోక్ కుమార్‌లు తెలిపారు. మొదటి షిఫ్టులో 180 మందికి 118 మంది.. రెండో షిఫ్టులో 180 మందికి గానూ 135 మంది.. మూడో షిఫ్టులో 180 మందికి గానూ 128 మంది.. నాలుగో షిఫ్టులో 180 మందికి 137 మంది హాజరయ్యారని వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు వారు తెలిపారు.

జలమయమైన రహదారులు



ఘంటసాల: మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఘంటసాల ప్రధాన సెంటర్, మల్లంపల్లి, రామానగరం ప్రధాన రహదారులతో పాటు పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కొంత సమయం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

మచిలీపట్నం టౌన్: నగరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేసవిని తలపించేలా ఎండ రాగా.. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణ కాలుష్యం

గుడివాడ టౌన్: ప్లాస్టిక్ వాడకం పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణం అని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు అన్నారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం, పర్యావరణాన్ని కాపాడదాం అనే నినాదాలు చేస్తూ ఏలూరు రోడ్డు, నెహ్రూచౌక్‌ల మీదుగా ర్యాలీ కొనసాగింది. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరుతూ జ్యూట్ సంచులను వ్యాపారులకు, ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అలియా బేగం, ఎన్ఎస్ఎస్ పీఓ టీజే సతీష్‌చంద్ర, కో–ఆర్డినేటర్ జి.జీవన్ పాల్గొన్నారు.

అమ్మ వేడుకలకు వేళాయెె!

- నేటి నుంచి ఘనంగా శరన్నవరాత్రులు
- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- ఉత్సవాల ఏర్పాట్లను పూర్తి చేసిన నిర్వాహకులు



విద్యుత్ వెలుగులలో విశ్వనాథపల్లి నాంచారమ్మ దేవాలయం

కోడూరు: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు దేవాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కోడూరు గంగాభవానీ, కనకదుర్గమ్మ, విశ్వనాథపల్లి, మందపాకల అద్దంకి నాంచారమ్మ, మాచవరం తుంగపల్లెమ్మ, కోడూరు దానాశక్తి, హంసలదీవి, ఉల్లిపాలెం రాజ్యలక్ష్మీ అమ్మవార్ల ఆలయాల్లో ఉత్సవాలను సోమవారం ఉదయం నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లను ప్రత్యేక అలంకారాల్లో తీర్చిదిద్ది భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వివరించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాల వద్ద కోలాహల వాతావరణం నెలకొంది.



పెదకళ్లేపల్లి పార్వతీ అమ్మవారు

వైభవోపేతంగా ఉత్సవాలు..

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దసరా మహోత్సవాలను స్థానికంగా సోమవారం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా దక్షిణ కాశీగా పేరు గాంచిన పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రీ పార్వతీ, శ్రీ దుర్గా అమ్మవార్ల శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు వెల్లడించారు. రోజూ శ్రీ నాగేశ్వరస్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చన పూజలు విశేషంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలను వివరించారు. విజయ దశమి సందర్భంగా రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్లకు శమీపూజ, ప్రత్యేక వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



పెదకళ్లేపల్లి దుర్గామాత

ప్రత్యేక అలంకారాల్లో అమ్మవార్ల దర్శనం..

పెడన: దసరా సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలను నిర్వహించడానికి ఆలయ కమిటీలు, యువత చర్యలు చేపట్టారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వహక కమిటీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా తెలిపారు. అలానే పైడమ్మ దేవస్థానంలోనూ అమ్మవారిని వివిధ రూపాలలో అలకరించనున్నట్లు ఆలయ ఈవో గోవాడ వెంకటకృష్ణారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కృత్తివెన్ను: శరన్నవరాత్రి మహోత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కృత్తివెన్ను శివాలయం, అడ్డపర్ర, నీలిపూడి, చినపాండ్రాక, గరిశపూడి, లక్ష్మీపురం, పోడు, చందాల, మాట్లాం తదితర గ్రామాల్లో ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘంటసాల: శ్రీ దేవీ శరన్నవరాత్రుల మహోత్సవానికి ఘంటసాల సత్రవు సెంటర్‌లోని శ్రీ రామాలయం ముస్తాబైయ్యింది. ఈ సందర్భంగా శ్రీ రామాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా రామాలయం ప్రాంగణంలో ఆస్ట్రేలియాకు చెందిన ఎన్నారై ఆదిరాల సుమన్–చైతన్య దంపతులు అమ్మవారి విగ్రహాన్ని అందించగా కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహోత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

గూడూరు: స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి సమ్మెట ఆంజనేయ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవాల వివరాలను వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆలయాలకు ఉత్సవ శోభ..

మచిలీపట్నం టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు నగరంలోని పలు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, ఈడేపల్లి శక్తి ఆలయం, ఆజాద్‌రోడ్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, గీతా మందిరం, భాస్కరపురంలోని త్రిశక్తి పీఠం, ఓగీసుపేట దుర్గాదేవి ఆలయం, రాజుపేటలోని ముచ్చం దేవాలయం, బెల్లంకోట్ల సందులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, రేవతి థియేటర్ సెంటర్లోని గంగానమ్మ తల్లి ఆలయం తదితర ఆలయాలను దసరా ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ఆలయాల్లో రోజూ మహిళలు పలు పూజలతో పాటు కుంకుమార్చనలు, పారాయణాలు నిర్వహించనున్నారు.



కాంతులీనుతున్న కన్యకా పరమేశ్వరి ఆలయం



ముస్తాబైన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం

ఉచిత హోమియో వైద్య శిబిరం

చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక క్లబ్ ఆవరణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు మణికంఠ 55 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు అన్నం సత్యవాణి, దింటకుర్తి జ్యోతి, సువర్చల, కుసుమ, గణపతిలు సేవలు అందించగా.. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శిలు అమరవాణి, గోళ్ల వెంకటరత్నంలు శిబిరాన్ని పర్యవేక్షించారు.

తాడేపల్లి(ఘంటసాల): తాడేపల్లి ఆశ్రమంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. మలయాళ స్వామి పెద్దాశ్రమంలో కృష్ణాజిల్లా బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ, చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, కీ.శే. సూరపనేని రామలింగయ్య–వెంకటరావమ్మ కుటుంబ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి చికిత్స శిబిరంలో ఆదివారం 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలలిపారు. చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల డాక్టర్ ఓవియో ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్స్ జి.రంజిత్ కుమార్, డి.మెజెస్, ఆల్బర్ట్, జగన్, ఆప్తమ్స్ అశ్విన్, కిషోర్ కుమార్, టోని 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు గొర్రెపాటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లి పెద్దాశ్రమంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చిట్టూర్పులో..

ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలో కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ, పరుచూరి సేవా సమితి వారి సహకారంతో సాయిదుర్గ క్లీనిక్ ఆప్టికల్స్ వారితో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూషడపు వెంకట రామారావు, డాక్టర్ పూర్ణ సుజిత్, డాక్టర్ రేఖన 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కొడాలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుత్తికొండ వరప్రసాద్, ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షులు దాసరి సతీష్, చిట్టూర్పు గ్రంథాలయాధికారి పరుచూరి శేషగిరి రావు, వార్డు సభ్యులు యలవర్తి వంశీకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకన్న సన్నిధిలో నవరాత్రులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి దసరా నవరాత్రుల మహోత్సవాలను నిర్వహించేందుకు ఆదివారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారని దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు తెలిపారు. అమ్మవారిని సోమవారం ఆదిలక్ష్మీ దేవిగా గాజులతో అలంకరణ చేయనున్నారు. 23న వరి, చెరకులతో ధాన్యలక్ష్మీ దేవిగా.. 24న స్వర్ణ కవచం, స్వర్ణ ఆభరణాలతో ధైర్యలక్ష్మీ దేవిగా.. 25న చందనంతో గజలక్ష్మీ దేవిగా అలంకరణ చేయనున్నారు. 26న బొమ్మలతో సంతాన లక్ష్మీ దేవిగా.. 27న మల్లి, కనకాంబరం పుష్పాలంకరణతో విజయలక్ష్మీ దేవిగా.. 28న పూలంగి సేవతో సౌభాగ్య లక్ష్మి దేవి, 29న సరస్వతి అలంకరణతో విద్యాలక్ష్మి దేవిగా.. 30న చామంతులతో వరలక్ష్మీ దేవిగా అక్టోబరు ఒకటో తేదీన తామర, కలువలతో మహాలక్ష్మీ దేవిగా.. 2న ధనలక్ష్మీ దేవిగా అమ్మవారిని అలంకరించనున్నారు.



విద్యుద్దీపాలతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ సమూహం

నేడు బాలత్రిపుర సుందరీదేవిగా కొండలమ్మ

గుడ్లవల్లేరు: దసరా నవరాత్రులను పురస్కరించుకుని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారు సోమవారం భక్తులకు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమివ్వనున్నారని దేవస్థాన ఈవో ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడె వెంకట విష్ణు మోహనరావు ఆదివారం తెలిపారు. ఈ ఉత్సవాలను తెలియపరిచే పోస్టర్లను గుడివాడ నుంచి మచిలీపట్నం వరకు ప్రచారం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

పామర్రు: మానవత సేవా సంస్థ అధ్యక్షుడు ఎస్.త్రివిక్రమరావు ఆధ్వర్యంలో స్థానిక రామాంజనేయ కాలనీలో వృద్ధులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, మానవత జీవ కాల సభ్యుడు తన తండ్రి సీతారామయ్య జ్ఞాపకార్థం వృద్ధులకు వస్త్రాలను అందజేశారని పేర్కొన్నారు. మానవత ప్రతినిధులు శీతాల ప్రసాద్, పీఎంఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మీలాదున్నబీ



గూడూరు: గూడూరు పటాన్‌పేటలోని హజ్రత్ నిర్గన్ షా ఔలియా దర్గాలో ఆదివారం మీలాదున్నబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ యాసీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మచిలీపట్నం రాజుపేట కొత్త మసీదు ఇమామ్ మౌలానా జైనుల్ ఆబెదీన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇస్లాం వ్యాప్తికి మొహమ్మద్ ప్రవక్త చేసిన కృషిని ఆయన వివరించారు. శాంతియుతమైన మార్గంలో నడుస్తూ ఒకరినొకరు సోదర భావంతో మెలగాలని ఆకాంక్షించారు. అనంతరం పటాన్‌పేట మసీదు ఇమామ్ మౌలానా జునైద్ రజా ముస్లిం సోదరులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమానికి ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కార్మికుల పని గంటలు పెంచడం దారుణం

గుడివాడ టౌన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల పనిగంటలు పెంచడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో కొనసాగుతున్న ఎనిమిది గంటల పనిని రోజుకు 13 గంటలుగా పెంచడం దుర్మార్గమన్నారు. ఇది శ్రమ దోపిడీ అన్నారు. ఈ అంశాన్ని వెనక్కు తీసుకోకపోతే కార్మికులు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.కొండ, ఎ.విజయకుమార్ పాల్గొన్నారు.

కొండలమ్మకు పాల పొంగళ్ల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఆదివారం సందడిగా మారింది. మహిళలు పాల పొంగళ్లను పొంగించిన మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఈవో ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడె వెంకట విష్ణు మోహనరావు(మోహన్), ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు.

నిత్యావసర వస్తువులు అందజేత

మండవల్లి: గన్నవరంలో రోడ్డు ప్రమాదంలో జీవనోపాధి కోల్పోయిన కూనపురెడ్డి పాండురంగ కుటుంబానికి ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర సరుకులు, రూ. 7 వేలు ఆర్థిక సాయం అందజేసింది. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారులు, ఉమ్మడి కృష్ణా జిల్లా కెరీర్ గైడెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమర్, మండల అధ్యక్షుడు కూనపురెడ్డి వెంకట బాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమాజ సేవే ఓ మహాయజ్ఞం

పీఠాధిపతి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజీయర్ స్వామీజీ

నాగాయలంక: సమాజ సేవ అనేది ఓ మహాయజ్ఞం అని.. సేవా నిరతికి ఓ రాజకీయ నాయకుడు తోడైతే ప్రజలకు కలిగే మేలేమిటోదివంగత మండలి వెంకట కృష్ణారావు నిరూపించారని ఉల్లిపాలెం అష్టాక్షరి పీఠాధిపతి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజీయర్ స్వామీజీ పేర్కొన్నారు. స్థానిక ఎంవీకే రావు శత జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నాగాయలంక శ్రీకన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 50వ రోజు వేడుక సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తలశిల స్వర్ణలత అధ్యక్షతన జరిగిన సభలో స్వామీజీ అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి కృష్ణారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీ, విజయవాడ ఒమెగా అనూ హాస్పటల్ సంయుక్తంగా జరిపిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్, కాంట్రాక్టర్ సబ్బినేని మహేష్ ఆర్థిక సౌజన్యంతో మందులు ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా 600 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్(రాజా), తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్, డీసీ చైర్మన్ బండ్రెడి చినబాబు, ఏఎంసీ చైర్మన్‌లు కె.వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, రాజనాల వీరబాబు, మత్తి వెంకటేశ్వరావు, మెండు చంటి, యాసం చిట్టిబాబు, బండ్రెడ్డి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామానుజీయర్ స్వామీజీ, పక్కన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పరామర్శ

కోనేరు సెంటర్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆదివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. తొలుత ఎస్ఎన్ గొల్లపాలెం చేరుకున్న కిట్టు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ కార్యకర్త కలపాల రాజేష్ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. సోమన ఆదినిరంజన్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పిల్లంగోళ్లపాలెం గ్రామానికి చేరుకుని కార్యకర్త శ్రీనివాసరావు తల్లి మృతి చెందగా ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలానే బుద్దాలపాలెంలోని బసవయ్యను, గొల్లగూడెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ఈడే కేశవరావు అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. కార్యక్రమంలో నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహన నాంచారయ్య, జిల్లా సహాయ కార్యదర్శి గణేశని రమేష్, మందా బాబురావు, వేముల ఏడుకొండలు, బెజవాడ సుబ్రహ్మణ్యం, పరింకాయల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యకర్తను పరామర్శిస్తున్న పేర్ని కిట్టు

పేదలకు అన్నప్రసాదాల వితరణ

పెడన: అఖిల భారత అయ్యప్ప దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురు గల బస్‌షెల్టర్‌లో ఈ కార్యక్రమం చేపట్టారు. పెడన శాఖ సేవా సమితి ఇటీవల నూతనంగా బాధ్యతలను చేపట్టిన నేపథ్యంలో సమితి అధ్యక్షుడు కొత్త తులసి నాగ వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ.. దాతల సహకారంతో అన్న ప్రసాదాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కొల్లూరి సత్యనారాయణ(చిన్న), పేరిశెట్టి సుబ్రహ్మణ్యం, బాల బాలాజీ, ముంగర భానుతేజ, పడమట దక్షిణామూర్తి, చిలుకోటి ఆనంద్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: అవనిగడ్డ, పులిగడ్డ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలాబత్తిన గోపాలం యాచకులు, వృద్ధులకు భోజన ప్యాకెట్లను అందజేశారు. తమ కుమారుడు దివిసీమ భీమ్‌జీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోలాబత్తిన బిపిన్ చంద్రపాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని షిర్డీసాయి అన్న ప్రసాదం నిర్వాహకుడు చిట్టా ప్రసాద్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపాలంతో గొరుముచ్చు రవి, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

వైభవంగా సూర్యనారాయణుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

వేకనూరు(అవనిగడ్డ): మండల పరిధిలోని వేకనూరు సూర్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దీవి నరసింహారావు(నాని)తో పాటు 8 మంది రుత్వికులు స్వామివారికి పంచామృతాలు, చందన, పుష్పాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మృత్యుంజయ హోమం, ఆదిత్య హోమం, నవగ్రహ హోమం, ఆయుష్ హోమం, అనుగ్రహ హోమాలు, స్వామివారి శాంతి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 10 మంది దంపతులు హోమం, కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. పలు ప్రాంతాల భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుంగల వసంతరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

కోడూరు: వేట సమయంలో మత్స్యకారులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పాలకాయతిప్ప మెరైన్ సీఐ ఆర్.సురేష్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని పాలకాయతిప్ప గ్రామంలో మత్స్యకారులకు వేట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికి ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలని, సముద్రంలో గుర్తు తెలియని బోట్లు కనిపిస్తే వెంటనే మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు. బోట్ల కింద ఉండే ఫ్యాన్ రెక్కల కారణంగా అరుదైన ఆలీవ్ రిడ్లే జాతి తాబేళ్లు మృతి చెందుతున్నాయని.. వీటి పట్ల మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్‌కు సంబంధించిన చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని, గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉజ్వల్ కుమార్, అటవీ అధికారులు వి.మధుసూదన్, ఎండీ జరీనా బేగం, వీఆర్వో ఒడుగు గోపాలకృష్ణ, సాగర మిత్ర చిలకలపూడి మోషే, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్‌రెడ్డి